ఇసుకాసురులు


పొన్నాడ వద్ద నిల్వ చేసిన ఇసుక

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ నిబంధనలను కొంత మంది అతిక్రమించి ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చింది. దీనికి తూట్లు పొడుస్తూ కొంతమంది ఇసుకాసురులు కాసులు మూటగట్టుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు చూడటం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట, పొన్నాడ పంచాయతీ తెప్పరేవు, పాతపొన్నాడ రీచ్‌ల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా జేసీబీలు వాడుతున్నారు. మరోపక్క రీచ్‌ల నుంచి పొన్నాడ, తమ్మినాయుడుపేట, బొంతలకోడూరు రహదారుల పక్కన ఇసుక పోగులు వేస్తున్నారు.

నిరంతరం ఇసుక సరఫరా..

జాతీయ రహదారికి అనుకొని చిలకపాలెం, అల్లినగరం, కింతలిమిల్లు, కొయ్యరాళ్లు, దుప్పలవలస, కుశాలపురం ప్రాంతాల్లో సైతం ఇసుక పోగులు వేస్తున్నారు. రాత్రి సమయంలో ట్రిప్పర్లు, లారీలకు లోడ్ చేసి ఇసుక తరలిస్తున్నారు. ఇసుక రీచ్‌ల్లో 24 గంటలూ ఇసుక ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రీచ్ ఉన్న గ్రామాల్లో ట్రాక్టర్ యజమానులు, కూటమి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఈ వ్యాపారం సాగిస్తున్నారు. యథేచ్ఛగా జాతీయ రహదారిపై లారీల్లో ఇసుక అక్రమ రవాణా అవుతున్నా.. అధికారులు స్పందించటం లేదు. మొక్కుబడిగా రీచ్‌లను పరిశీలిస్తున్నారు. రాత్రి సమయంలో అధికారులు ప్రత్యేకంగా దాడులు చేస్తేనే యంత్రాలతో ఇసుక తవ్వకం, లారీల్లో తరలింపు బయటపడతాయి. రాత్రి సమయంలో కనీస పర్యవేక్షణ లేకపోవటంతో అక్రమార్కులకు అనుకూలంగా మారుతోంది. ఇసుక రీచ్‌ల్లో పెద్ద, పెద్ద గోతులు సైతం ఏర్పడుతున్నాయి. పర్యావరణానికి హానితోపాటు, భవిష్యత్‌లో నదిపై ఉన్న వంతెనలు, నదిలో ఉన్న తాగునీటి పథకాలకు సైతం ప్రమాదకరంగా మారనుంది.


బొంతలకోడూరు రోడ్డులో వేసిన ఇసుక పోగు


తెప్పరేవు రీచ్‌లో ఇసుక ట్రాక్టర్లు

పోగులు వేసి ఇసుక తరలిస్తున్నారు



నాగావళి నది రీచ్‌ల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. పోగులు వేసి విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారం చేసి కోట్లు సంపాదిస్తున్నారు. అధికారులు కనీసం స్పందించటం లేదు. నిబంధనలను అమలు చేయటం లేదు.

– అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్, అరిణాంఅక్కివలస

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం



ఉచిత ఇసుక పాలసీలోని నిబంధనలు పాటించాలి. నిబంధనలకు లోబడి ఇసుక తరలింపు జరగాలి. మండలంలోని తమ్మినాయుడుపేట, పాతపొన్నాడ, తెప్పరేవు ఇసుక రీచ్‌లను రోజూ వీఆర్వోలు పరిశీలిస్తున్నారు. ఇసుక పోగులు కనిపిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.

– ఎ.సింహాచలం, ఎచ్చెర్ల తహసీల్దార్

ఆర్ట్స్ కళాశాల పరిసరాల పరిశీలన


కళాశాల పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఆర్ట్స్ కళాశాల పరిసరాల దయనీయ స్థితిపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు వచ్చాయి. అలాగే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ సైతం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు శుక్రవారం కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేఖ కళాశాలలో అసాంఘీక కార్యకలాపాల దుస్థితిని సీఐకు వివరించారు. సీఐ ఈశ్వరరావు స్పందిస్తూ విద్యార్థులకు భద్రత కల్పించడం తమ బాధ్యత అన్నారు. ఈ విషయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి కఠినంగా వ్యవహరిస్తారన్నారు. పెట్రోలింగ్ బీట్ వ్యవస్థను పెంచామన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కళాశాలకు పిల్లలు వచ్చే, వెళ్లే సమయాల్లో పోలీసులు కాపు కాస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో కళాశాల పరిసరాల్లోనే ఓ ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, మరో ఎనిమిది మంది వరకు నైట్‌బీట్ రౌండ్‌లో టచ్ చేస్తున్నారన్నారు. అనంతరం సీఐ ఈశ్వరరావు జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే నష్టం, సైబర్ నేరాలపై అవగాహన కలించారు.

కళింగపట్నం టీడీపీలో లుకలుకలు!

- బస్ షెల్టర్ ప్రారంభోత్సవం శిలా ఫలకం ధ్వంసానికి ప్రయత్నం
- కళింగపట్నం ఎంపీటీసీ ఉన్న ఫ్లెక్సీలు చించివేత


ఎంపీటీసీ శ్రీధరరెడ్డి ఉన్న ఫొటోలను చింపేసిన ఫ్లెక్సీ

గార: గార మండల టీడీపీ నాయకుల్లో లుకలుకలు బయటపడుతున్నాయి. కళింగపట్నం పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు, మాజీ సర్పంచ్‌ల మధ్య వర్గపోరు బయటపడింది. తాజాగా బస్‌షెల్టర్ ప్రారంభోత్సవం ఫలకాన్ని ధ్వంసం చేసే ప్రయత్నంతో పాటు ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి ఫొటోలను ఫ్లెక్సీలో చింపేశారు. తాన్‌సాహేబ్‌పేట జంక్షన్ వద్ద ఈ నెల రెండో తేదీన బస్‌షెల్టర్ ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్ వచ్చారు. ఆ సమయంలో ఎంపీటీసీ కిలుగు శ్రీధర్‌రెడ్డి (అప్పలనాయుడు), మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తిలు వేర్వేరుగా ఫ్లెక్సీలు వేసుకున్నారు. అయితే ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తాజాగా వివాదానికి కారణమయ్యాయి. శ్రీధరరెడ్డి ఫ్లెక్సీలు చిరిగి ఉండగా, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి ఫ్లెక్సీలుకు బాగానే ఉండటంతో కార్యకర్తల్లో అంతర్గతంగా చర్చకు దారితీసింది. కావాలనే తమ నాయకుని ఫ్లెక్సీని చింపే ప్రయత్నం చేశారని కార్యకర్తలు గుడగుసలాడుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు రెండుగా విడిపోయి.. వేర్వేరుగా చూపుతున్న చర్యలు పెద్ద నాయకులకు తలనొప్పిగా మారాయి. ఈ విషయమై ముందుగా వేర్వేరుగా పోలీసులకు ఫోన్‌ద్వారా సమాచారం తెలియజేసినట్టు తెలిసింది. ప్రాథమికంగా సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించినట్టు సమాచారం. జరిగిన సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని, నిందితులు ఎంతటివారికైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ గార స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, సరైన న్యాయం జరగకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీటీసీ సభ్యుడు శ్రీధరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలసలోని నాగార్జున అగ్రికెం పరిశ్రమ వ్యవస్థాపకుడు కేవీకే రాజు జయంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని శ్రీకాకుళం డిప్యూటీ ఇన్‌స్పెక్టరాఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు ప్రారంభించారు. పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు రక్తం సేకరించారు. సొసైటీ జిల్లా చైర్మన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందే ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పరిశ్రమ ఆవరణలో కేవీకే రాజు చిత్రపటానికి నివాళులర్పించారు. పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, ఏఈ సూర్యకళ, పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు, జీఎం శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన జాగ్రతలు తీసుకోవాలని బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అనుష, ప్రతిజ్ఞ శర్మ అన్నారు. మండలంలోని ఎందువ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య సేవలు అందించారు. మురుగునీరు నిల్వ ఉంటే డెంగీ, మలేరియా జ్వరాలతోపాటు అతిసార వ్యాధి కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ కె.సౌజన్య, హెల్త్ అసిస్టెంట్లు కె.రాజులమ్మ, వై.శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు ఆదిలక్ష్మి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి, పౌరులందరికీ ప్రాథమిక హక్కులు సమానంగా అందించడానికి మనమంతా కృషి చేయాలని వక్తలు అన్నారు. ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ర్యాలీ కరపత్రాను శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా బాధ్యులు బొడ్డేపల్లి మోహన్‌రావు, మిస్క కృష్ణయ్య, పేడాడ కృష్ణారావు, డి.గణేష్, కళ్లేపల్లి రాంగోపాల్, చౌదరి లక్ష్మణరావు, కె.వి.జగన్నాథరావు, ఫాల్గుణరావు, కిలారి ఈశ్వరరావు, పూజారి హరిప్రసన్న, రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం సాధ్యం


శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలలో ఉండే పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులు, పాఠకులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథఆలయ వారోత్సవాల సందర్భంగా శ్రీకాకుళంలోని జిల్లా గ్రంథఆలయ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగాధిపతి ఎస్. చిన్నారావు పాల్గొన్నారు. అలాగే బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో కూడా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి. ఉగ్రసేను పాల్గొన్నారు.

గార: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గార ఏఎస్‌ఐ టి.చంద్రమోహన్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ, కుమారస్వామి, కృష్ణారావు, హెల్పర్ సీహెచ్ సూర్యనారాయణ ఉన్నారు.


గార: పుస్తకాలను ఆసక్తిగా చదువుతున్న విద్యార్థులు

అవగాహన



చదువుకునే వయసులో విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో సంకల్పం పేరిట మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావంపై శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న చైతన్య కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సీఐ పైడపునాయుడు, ఎస్సై హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -శ్రీకాకుళం క్రైమ్

అన్నదానం



శ్రీకాకుళం నగరంలోని ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో ఉంటున్నవారికి వాల్తేరు గ్రామానికి చెందిన వావిలపల్లి అమ్మాయమ్మ అన్నదానాన్ని శుక్రవారం చేశారు. తన కుమారుడు.. నేవీ సోల్జర్ కృష్ణంరాజు విధి నిర్వహణలో అమరుడైనారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని 200 మంది వృద్ధులకు అన్న, వస్త్రదానాలు చేశారు. -శ్రీకాకుళం కల్చరల్

సందర్శన



శ్రీకాకుళం నగరంలోని రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ వివేకానంద ఉన్నారు. -శ్రీకాకుళం క్రైమ్

విద్యార్థిని ప్రతిభ



శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.హేమలత ప్రతిభ కనబర్చింది. జిల్లాస్థాయి గ్రంథాలయ వారోత్స వేడుకల్లో విజేతగా నిలిచి నగదు బహుమతిని అందుకుంది. విద్యార్థినిని గురుకులం ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయినులు అభినందించారు. -శ్రీకాకుళం న్యూకాలనీ

పిల్లల క్షేమం కోరుకునేది తల్లిదండ్రులే

శ్రీకాకుళం న్యూకాలనీ: పిల్లల క్షేమం కోరుకునేది తల్లిదండ్రులేనని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో క్రమశిక్షణ కలిగి వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ అన్నెపు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్పీ సత్కరించి, బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కోఆర్డినేటర్‌లు నిరోషా, దేవి, విజయ పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రతినిధులు


శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవాలయం కోటిఒత్తులను వెలిగిస్తున్న భక్తులు

పౌర్ణమి వెలుగులు..

కార్తీక పౌర్ణమిని శుక్రవారం భక్తులు ఘనంగా జరపుకున్నారు. ఈ సందర్భంగా దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నదులు, చెరువుల్లో దీపాలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. నదులకు హారతులిచ్చారు. ఆలయాల్లో చేపట్టిన జ్వాలాతోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


జి.సిగడాం: ఎందువ కైలాసగిరిపై అఖండ జ్యోతిని వెలిగిస్తున్న వేద పండితులు, గ్రామస్తులు


గారలోని వేంకటేశ్వస్వామి ఆలయంలో గరుడ హారతినిస్తున్న భక్తులు


ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాల వద్ద వెలిగించిన దీపాలు

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ శానిటరీ మేస్త్రిలు, కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల నిరసనలు కొనసాగుతున్నాయి. తొలగించిన శానిటరీ మేస్త్రిలను విధుల్లోకి తీసుకోవాని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్ బేషరతుగా మేస్త్రిలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని.. లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మార్చుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా (డీసీఎల్) ఉప కారిృక కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అలాగే శ్రీకాకుళం నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మూడో రోజైన శుక్రవారం కూడా సమ్మె కొనసాగించారు. వినూత్నంగా కార్మికులంతా మోకాలపై ఉంటూ చెవులో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు, ముద్దాడ రామారావు, కలగ జగదీష్ , టొంపల షణ్ముఖరావు, మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి,ఎన్. పార్థసారథి, ఆర్.గణేష్, రామచంద్ర, డి.రమణ, సురేష్ ఉన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


గిరి ప్రదక్షణ చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామ సమీపంలోని కొండపై గల కైలాశేశ్వరుడి క్షేత్రంలో శుక్రవారం అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షణ చేపట్టారు. కొండ దిగువన ఉన్న ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయం నుంచి ఉదయం 5 గంటలకు వేదపండితులు గిరి ప్రదక్షణను ప్రారంభించారు. అక్కడ నుంచి నడిమివలస కూడలిలోని ఆభయాంజనేయ స్వామి, షిరిడీ సాయిబాబా, గడబపాలెం కూడలి, సేతుభీమవరంలోని ఆంజనేయస్వామి, గెడ్డకంచరాంలోని పైడితల్లి అమ్మవారు, షిరిడీ సాయిబాబా, ఆంజనేయస్వామి, ఎందువలోని ఆంజనేయస్వామి, దుర్గాదేవి, దత్తాత్రేయ, కామేశ్వరీదేవి, సంతోషిమాత, ధన్వంతరి, సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. శివనామస్మరణ మార్మోగింది. అయ్యప్ప, శివ, సాయిబాబా, భవానీ స్వాములు, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఎందువలో కైలాసగిరి

అపార్ వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధాకర్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థికి అపార్ నంబర్ కేటాయించాలని ఎచ్చెర్ల మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ సుధాకర్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అపార్ ప్రక్రియ శతం శాతం పూర్తిచేయాలన్నారు. అపార్ నెంబర్ ఆధారంగా భవిష్యత్‌లో విద్యార్థి పూర్తి సమాచారం, విద్యా ధ్రువీకరణ పత్రాలు అందజేయటం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, తహసీల్దార్ ఎ.సింహాచలం, ఎంఈఓ కె.పున్నయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజాతంత్ర హక్కుల రక్షణే ధ్యేయం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజాతంత్ర హక్కులను కాపాడుకునేందుకు ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ్‌గౌరీని గెలిపించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం స్థానిక సంఘ కార్యాలయంలో లండ బాబూరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు రాష్ట్ర బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా సంఘ కరపత్రాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కిశోర్‌కుమార్, చౌదరి రవీంద్ర, ఎండ ఉమాశంకర్, లండ బాబురావు, బమ్మిడి శ్రీరామ్ మూర్తి, దాలయ్య, రవికుమార్, అప్పారావు పాల్గొన్నారు.